క్లుప్తంగా

ఘనంగా ఉత్సవాలు



మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ స్టేజీ వద్ద వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా జల్దిబిందె ఊరేగింపుగా తీసుకు వచ్చి స్వామికి జల, పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మరికల్: మండల కేంద్రానికి ఉన్నత చదువుల నిమిత్తం పల్లెగడ్డ, మాధవరం నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సును నడిపించాలని గ్రామస్తులు హన్మంతు, రాములు, రాఘవేందర్‌రెడ్డిలు అన్నారు. వారు సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ నిత్యం రెండు గ్రామాల నుంచి రెండు వందలకు పైగా విద్యార్థులు మరికల్‌కు ఉన్నత చదువుల నిమిత్తం కాలినడకన వస్తున్నారని తెలిపారు. బస్సు లేకపోవడం వల్ల పాఠశాల సమయానికి విద్యార్థులు చేరుకోలేకపోతున్నారన్నారు. నారాయణపేట ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సన్మానం

ఊట్కూర్: మండలంలోని మల్లెపల్లి గ్రామంలో సోమవారం అగ్నిపథ్‌కు ఎంపికైన గార్లపల్లి లక్ష్మణ్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తల్లిదండ్రులను శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలస్వామి, నాయకులు కతలప్ప, ధర్మరాజు, తాయప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్‌లో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సేవాభావం అలవర్చుకోవాలి



ఊట్కూరు: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో పాటు సేవాభావం పెంపొందించుకోవాలని చిలుకూరు బాలాజీ దేవాలయం పురోహితులు సురేష్ మహరాజు అన్నారు. సోమవారం తిప్పరాస్‌పల్లి గ్రామస్తులు ఇండ్లూరు శంకర లింగేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్రలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు వెయ్యి మంది పాదయాత్రలో పాల్గొన్నారు. సత్యనారాయణ, అశోక్, కృష్ణయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నవమి ఉత్సవాలు



ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం శివారులో ఉన్న నందనవనం బద్రీనారాయణ స్వామి సన్నిధిలో సోమవారం మాధ్వ నవమి ఉత్సవాలను నిర్వహించారు. శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ, అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఉడిపి కాన్నూర్ మఠం విద్వాన్ అనిల్‌దేశాయ్ ప్రవచనాలు చెప్పారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ ఉత్సవాలలో ముంబయి విద్యాపీఠం హరీష్‌ఆచార్య, భరత్‌రాజు, నారాయణరావు, భీంసేనారావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి దాతలు విరాళాన్ని అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం దోమ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గ్రామానికి చెందిన వీవీపీ వెంకట్రాంరెడ్డి కుమారుడు పాండురంగారెడ్డి, కోడలు హరితారెడ్డి పాఠశాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రూ.20వేలు అందజేశారన్నారు.

సంక్షోభంలో ‘సంక్షేమం’

- వసతి గృహాలలో కనీస సౌకర్యాలు కరువు
- అద్దె భవనాలతో నెట్టుకొస్తున్న యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- రాత్రి సమయంలో ఇళ్లకు వెళ్లి పడుకుంటున్న వైనం
- స్పందించని అధికారులు



మాగనూర్‌లో అద్దెభవనంలో కొనసాగుతున్న వసతి గృహం



మరుగుదొడ్ల పరిస్థితి ఇలా..

మాగనూర్: పేద విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు.. సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. కనీస సౌకర్యాల కల్పనలో సంబంధింత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. స్నానాల గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మాగనూర్ బాలికల హాస్టల్ పరిస్థితి మరింత దారుణంగా తయ్యారయ్యింది. మండల కేంద్రంలో ఉన్న ఈ వసతిగృహంలో రెండొందల మంది విద్యార్థులకు అవకాశం కల్పించాల్సి ఉండగా కేవలం 91 మాత్రమే అడ్మిషన్లు పొందారు. వీరిలో కొంతమంది విద్యార్థినులు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. మిగతావారు దుప్పట్లు, నోట్స్, పెట్టెలు తదితర సామగ్రి వచ్చినప్పుడు మాత్రమే హాస్టల్‌కు వచ్చి తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న కొందరు విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి తలెత్తింది. అడ్మిషన్లు పొందిన వారిలో మండల కేంద్రానికే చెందిన వారు ఎక్కువగా ఉన్నారు. సౌకర్యాలు సరిగా ఉండకపోతుండడంతో రాత్రి భోజనం చేసి నిద్రించేందుకు ఇళ్లకు వెళ్తున్నారు. కాగా సదుపాయాలు కల్పిస్తే ఇక్కడే ఉండి చదువుకుంటామని బాలికలు చెబుతున్నారు. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

స్థానిక హాస్టల్ భవన నిర్మాణానికి 12 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ రూ. 45.10 లక్షలు కేటాయించినట్లు ఉత్తర్వులు కూడా జారీచేశారు. ఈ ఉత్తర్వులను అప్పటి హాస్టల్ వార్డెన్ నిర్మల, ఏఎస్‌డబ్ల్యూకు పంపించారు. భవన నిర్మాణానికి త్వరలో టెండర్ కూడా వేయాలని సంక్షేమ అధికారులకు కలెక్టర్ అప్పట్లో ఆదేశాలిచ్చారు. వసతిగృహం నిర్మాణం కోసం పాత గ్రామ పంచాయతీ సమీపంలో రెండెకరాల స్థలాన్ని కూడా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉచితంగా ఇచ్చేందుకు అప్పట్లో తీర్మానం చేశారు. సర్వేకూడా చేసి భూమి వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు. పర్యవేక్షణ లోపించడంతో పనులు జరగలేదు. ఈ విద్యాసంవత్సరంలోనైనా బాలికల వసతిగృహాన్ని నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



మండల కేంద్రంలోని బాలికల వసతిగృహంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీరు కలుషితమవుతోంది. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేని కారణంగా హాస్టల్‌లో చేరడానికి, చేరినా ఇక్కడ ఉండడానికి చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా సొంత భవనం నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– నర్సింహ, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్నాం



బాలికల వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో సరైన సౌకర్యాలు లేవు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎక్కువ మంది విద్యార్థులు రాత్రి సమయాలల్లో ఇళ్లకు వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న అద్దె భవనం వద్దా అసంపూర్తిగా ప్రహరీ ఉండడంతో రాత్రివేళల్లో ఉండాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి.

– హేమలత, విద్యార్థి

సొంత భవనం నిర్మించాలి

ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో అరకొర సౌకర్యాల మధ్య బాలికల వసతి గృహం కొనసాగుతోంది. గతంలో సొంత భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరిగినా అవి మధ్యలోనే ఆగిపోయాయి. విద్యార్థుల ఇబ్బందులు అర్థం చేసుకుని సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– అనిత, వార్డెన్, మాగనూర్

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



మద్దూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీలత, నిడ్జింత సర్పంచ్ లావణ్య సూచించారు. సోమవారం నిడ్జింతలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపీటీసీ కాంతారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులతో మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను సోమవారం సర్పంచ్ సత్యమ్మ, ఎంపీపీ నర్సప్పలు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అంతర్గత రహదారుల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయించాలని సర్పంచ్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిప్పన్న, ఎంపీటీసీ లక్ష్మి, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.



కంపెనీ రద్దయ్యే వరకు పోరాటం



మాట్లాడుతున్న బాధిత గ్రామాల ప్రజలు

మరికల్: చిత్తనూర్ శివారులోని ఇథనాల్ కంపెనీని రద్దు చేసేవరకు నిరంతర పోరాటం సాగిస్తామని, ఎక్లాస్‌పూర్ ప్రజలు దీక్ష చేపడుతున్నట్లు మల్లేష్, రామచంద్రయ్య, లక్ష్మీనారాయణలు అన్నారు. గ్రామ పంచాయతీ వద్ద నల్ల కండువాలతో నిరసన వ్యక్తం చేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. మధు, తిరుపతయ్య, చెన్నప్ప, హుస్సేన్, వెంకటయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్స్ అందజేత



చిన్నపొర్లలో మెటీరియల్స్ అందుకున్న విద్యార్థులతో వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలు అందుకోవాలని విజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని గ్రామానికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. నియోజకవర్గంలో రూ.20 లక్షలతో దాదాపు 5వేల మంది విద్యార్థులకు మెటీరియల్స్ అందజేయాలని నిర్ణయించుకున్నామని, ఇప్పటికే ఆయా పాఠశాలలలో పంపిణీ పూర్తయినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు జగన్నాథ్‌రావు, నరసింహ, భాస్కర్, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్టడీమెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిములు, రామ్మోహన్, వెంకటేష్, ప్రేమ్‌నాథ్, రాఘవేంద్ర, రామకృష్ణ, సదానంద పాల్గొన్నారు.

స్టడీ హాల్ ఏర్పాటు

నారాయణపేట రూరల్: ఎలాంటి అంతరాయం లేకుండా పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలనుకునే అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా స్టడీ హాల్‌ను ఏర్పాటు చేసినట్లు వారియర్స్ డిఫెన్స్ అకాడమీ సభ్యులు తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి సహకారంతో స్థానిక కృష్ణగోకులం స్కూల్‌లో ఈ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఉంటుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 45 రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, ఎస్‌ఐ, కానిస్టేబుల్‌తో పాటు మరిన్ని పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరానికి ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నగేష్, అనిల్ పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

మక్తల్: మాద్వార్ శ్రీ గట్టు తిమ్మప్ప దేవాలయం దగ్గర శివ స్వాములు ఈశ్వరునికి పూజలు నిర్వహించారు. కలశ ఊరేగింపు చేపట్టారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : మండలంలోని అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం శివపూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్వప్న వెంకట్రామారెడ్డి స్వగృహంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన శివభక్తులు హాజరయ్యారు. మెట్లపూజ చేపట్టారు. స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భజనలు అలరించాయి. అనంతరం మహా మంగళహారతి, పెద్ద ఎత్తున స్వాములకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శాసనసభ్యులు ఎస్‌ఆర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ అంజలి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సుగంధమ్మ, జగన్మోహన్‌రెడ్డి, వేపూరి రాములు, గురుస్వాములు, నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

భగీరథ కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న బాల్‌రాం

నారాయణపేట టౌన్ : మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం అమలుచేసి, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నాకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొండన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, నరసింహ, మిషన్ భగీరథ కార్మిక సంఘం నాయకులు చొడప్ప, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న డీసీసీబీ చైర్మన్ నిజాంపాష

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మక్తల్‌లోనే ఉంటానన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిట్టెం దంపతులను గజమాలతో సన్మానించారు. కేక్‌కట్ చేయించారు. వేశారు. జడ్పీచైర్‌పర్సన్ వనజ, డీసీసీబీ చైర్మన్ నిజాంపాష, ఎంపీపీ వనజ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, జడ్పీటీసీ వెంకటయ్య, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు కేక్‌కట్ చేశారు. నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో జరిగిన వేడుకలలో నాయకులు గజమాలతో ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు. సర్పంచ్ రాజు, మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి సత్యప్ప పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలో జరిగిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యే స్థానిక క్షీరలింగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు విజప్పగౌడ, ఎంపీపీ పూర్ణిమ, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివప్ప, సర్పంచ్ రాధ, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేను నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములుశెట్టి, జడ్పీటీసీ గొనిజ్యోతి, విండో చైర్మెన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో సోమవారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివారెడ్డి, కొండారెడ్డి, నర్సిములు, శివాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి



మక్తల్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం మక్తల్ పట్టణంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, రవికుమార్ , శ్రీనివాస్‌గుప్తా, నారాయణ, నాగరాజ్, హరికృష్ణ, వెంకటేష్, బోయరవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి

కోస్గి: విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు చదవడం వల్ల స్వయంగా జీవనోపాధి పొందవచ్చునని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ ప్రశాంతి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థులకు పట్టణంలోని మీ సేవా కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలింపజేసి అవగాహన కల్పించారు. మీ సేవా కేంద్రాల ద్వారా కలుగుతున్న జీవనోపాధి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.



మీ సేవాకేంద్రం సందర్శనలో విద్యార్థులు

బ్యాంకుల పనితీరుపై అవగాహన



బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

కోస్గి: మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రత్యక్ష పరిశీలన ద్వారా బ్యాంకుల పనితీరుపై ఉపాధ్యాయుడు నర్సిములు అవగాహన కల్పించారు. 9వ తరగతి సాంఘీక శాస్త్రంలోని ‘బ్యాంకింగ్–విధివిధానాలు’ అనే పాఠ్యాంశంపై మరింత అవగాహన కల్పించడంలో భాగంగా సోమవారం గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంకును సందర్శనకు విద్యార్థులను తీసుకెళ్లారు. మేనేజర్ అనురాగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునః ప్రారంభించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్ : పాలమూర్ నుంచి వలసలు ఆగిపోయాయని అసత్య ప్రచారం చేసుకునేందుకు ముంబయి వెళ్లే ఆర్టీసీ బస్సును నిలిపివేశారని బీజేపీ పట్టణ అధ్యక్షులు రఘురామయ్యగౌడ్ విమర్శించారు. బస్‌డిపో ఎదురుగా సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం ఎంతో మంది పొట్ట చేతపట్టుకుని మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు బతుకుదెరువుకు వెళ్తున్నారని, స్థానికంగా ఉపాధిలేక ముంబయి బస్సు ఎక్కుతున్నారని వాపోయారు. ఎంతో సౌకర్యంగా ఉన్న బస్సును అధికార పార్టీ నాయకులు కావాలని ఆపించడం సరికాదని, గతంలో బండి సంజయ్ పాదయాత్ర సమయంలో వలస కార్మికులను కలిసి పాలమూర్ వలసల దుస్థితిపై మాట్లాడారని గుర్తు చేశారు. కలెక్షన్లు లేవని ఆర్టీసీ అధికారులు చెప్పడం సరికాదన్నారు. అనంతరం ఎస్‌టీఐ షేక్ నజీర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నారాయణపేట రూరల్ : పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఆర్డీఓ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అందచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, వైస్ చైర్మెన్ హరినారాయణబట్టడ్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆనంద్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

ఆనంద్ కుమార్ గౌడ్ ఎన్నిక

జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లో ఫిబ్రవరి 5న జరిగే టీయూడబ్ల్యూజేహెచ్ 143 మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ గోవర్ధన్‌గౌడ్ టీయూడబ్ల్యూజేహెచ్ 143 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్ కుమార్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన రాష్ట్ర మహాసభల్లో జిల్లా నుంచి నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా నవీన్‌కుమార్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా అనంతరామ్, రఘు, విష్ణులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మించాలని వినతి

మండలంలోని ఊటకుంటతండాలో ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సర్పంచ్ సీతమ్మతో కలిసి వారు వినతిపత్రం అందించి మాట్లాడారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే రెండవ విడత మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.25లక్షలతో భవనం నిర్మించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్డుతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మంగళవారం రానున్నారు. వివరాలను మండల సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

నిందితుడిని శిక్షించాలంటూ ధర్నా



మాట్లాడుతున్న గోపాల్

దామరగిద్ద: పెళ్లిచేసుకుంటానని ప్రేమపేరుతో మోసం చేసిన నిందితుడిని శిక్షించాలంటూ దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ మండలంలోని గత్ప గ్రామానికి చెందిన ఓ దళిత విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి కొన్ని సంవత్సరాలుగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడన్నారు. తీరా పెళ్లికి నిరాకరించడంతో విద్యార్థిని మనస్తాపంతో ఈ నెల 18న పురుగుల మందుతాగి మృతి చెందిందన్నారు. ఆమె తల్లిదండ్రులు దామరగిద్ద స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అనుమానాస్పద కేసుగా నమోదు చేయడం శోచనీయమన్నారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావ్ ఘటన స్థలానికి చేరుకొని రెండు రోజుల్లో అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు హన్మంతు, మహిళల సంఘర్షణ సమితి జిల్లా కన్వీనర్ ఈశ్వరమ్మ, నాగమ్మ, వెంకటప్ప, మహేష్, ప్రవీణ్ రాములు బాబు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.